వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 31 ఆగస్టు 2025

## ప్రారంభమైన భాద్రపదమాసం పూజా కార్యక్రమం



బద్వేలు, ఆగస్టు 30, ప్రభాతవార్త

నియోజకవర్గం గోపవరం మండలం వల్లేరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు భాద్రపదమాసం ప్రారంభంతో వైభవంగా అభిషేకం పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. తదుపరి స్వామి అమ్మవారు ప్రత్యేక పూల అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. తదుపరి పలువురు భక్తులు మాట్లాడుతూ ఆలయంలో స్వామి వారి మూల విరాట్ చూడటానికి చాలా చూడ ముచ్చట్గా ఉంటారన్నారు. ఇక్కడ స్వామి వారు భక్తుల పాలిట కొంగుబంగారంలో విరాజిల్లుతున్నారన్నారు. తదుపరి అన్నదాన కైంకర్యం నిర్వహించారు. తదుపరి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కుటుంభ సభ్యులు ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఖరారు

### బోయినపల్లిలో 4 గంటల పాటు పర్యటన



రాజంపేట, ఆగస్టు30 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన షెడ్యూల్ ఖరారు అయింది. సెప్టెంబర్ 1న 10 గంటలకు జూబ్లీహిల్స్ లోని నివాస నుంచి బయలుదేరుతారు. 10 20కి బేగంపేట ఎయిర్పోర్ట్ చేరుకుంటారు. బేగంపేట ఎయిర్పోర్ట్ నుంచి హెలికాప్టర్లో 11:50కి మన్నూరు సమీపం లోని హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. 12.10 నుంచి 12:50 వరకు ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ, లబ్ధిదారుల వద్దకు వెళ్లి పలకరిస్తారు. ధోబి ఘాటును పరిశీలిస్తారు. ప్రజలతో కలుస్తారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రజావేదిక వద్దకు చేరుకుంటారు. అర్థగంట పాటు లంచ్ టైం. 1.30నుంచి 1.40 వరకు ప్రజావేదిక వద్ద స్టాల్స్ను పరిశీలిస్తారు. 1:40 నుంచి 3.10 వరకు ప్రజావేదిక వద్ద జరిగే సభలో పాల్గొంటారు. 3.10 నుంచి 3 20 వరకు సోషల్ మీడియా ఇన్ఫ్లుయర్లో బేటి అవుతారు. 3:30 నుంచి 4:30 వరకు పార్టీ క్యాడర్ సమావేశమవుతారు. 4.35 గంటలకు బయలుదేరి ఉండవల్లి లోని తన నివాసానికి వెళ్తారు.

### అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి నిపుణుల

# నివేదిక సిద్ధం

- ఎర్త్ డ్యామ్ నిర్మాణంలో కోర్ వాల్ విధానం...?
- మరో స్పిల్ వే నిర్మాణం...
- ప్రాజెక్టు గేట్ల పటిష్టతకు సిఫార్సు ...
- డయా ఫ్రమ్ వాల్ దెబ్బతినిందా...
- 787 కోట్లతో ప్రతిపాదించిన బ్యారేజ్ నిర్మాణానికి నిపుణులు నో



కొండకు పక్కనే స్పిల్ వే కట్టనున్న ప్రదేశం



ఎర్త్ డ్యామ్ను కోర్ వాల్ విధానములో నదిలో నిర్మించనున్న ప్రాంతం

**అన్నమయ్య ప్రాజెక్టు పునర్ నిర్మాణం గాలి మరియు భూకంపం వచ్చినా తట్టుకునే స్థాయిలో నిర్మాణం పనులు చేపట్టాలని, అందుకు ప్రాజెక్ట్ నిర్మాణాల్లో చాలా అరుదుగా ఉపయోగించే కోర్ వాల్ పద్ధతిలో ఎర్త్ డ్యామ్ నిర్మాణాన్ని చేపట్టాలని నిపుణుల కమిటీ భావిస్తున్నట్లు సమాచారం. సాంప్రదాయ రాక్ ఫిల్మ్ నిర్మాణం వైపు కూడా నిపుణుల కమిటీ ఒక దశలో మొగ్గుచూపింది. తుంగభద్ర డ్యాం గేట్లు మొరాయించిన నేపథ్యంలో ఇక్కడ కూడా గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అన్నమయ్య ప్రాజెక్టు గేట్ల పటిష్టతకు కూడా చర్యలు చేపట్టాలని నిపుణుల కమిటీ సిఫార్సు చేసింది. 2021 నవంబర్ 19న ప్రాజెక్టుకు వచ్చిన వరద ఉపద్రవం లో కూడా ప్రాజెక్ట్ ఐదవ నెంబర్ గేటును అధికారులు ఎత్తకుండా పోయిన నేపథ్యంలో గేట్ల పటిష్టతపై నిపుణుల కమిటీ అనుమానం వ్యక్తం చేసింది. అంతేకాకుండా కొత్తగా మరొక స్పిల్ వే నిర్మాణాన్ని చేపట్టాలని కూడా సిఫారసు చేసినట్లు తెలిసింది. అత్యంత విశ్వసనీయ వర్గాలు ఎవరికి ద్వారా అందిన సమాచారం ప్రకారం అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ నివేదిక దాదాపు సిద్ధమైనట్లు సమాచారం. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందజేయున్నట్లు కూడా తెలిసింది.**

రాజంపేట, ఆగస్టు30 ప్రభాతవార్త

ఉమ్మడి కడప జిల్లా రాజంపేట మండలంలో చెయ్యేరు నదిపై నిర్మించిన అన్నమయ్య ప్రాజెక్టు ఎర్త్ డ్యామ్ వరదల్లో 2021 నవంబర్ 19న కొట్టుకుపోయింది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని నియమించింది. నిపుణుల కమిటీ గత నెల 13న ప్రాజెక్టును పరిశీలించింది. పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ చైర్మన్, కేంద్ర జల సంఘం చీఫ్ ఇంజనీర్ రమేష్ కుమార్ నేతృత్వంలో కమిటీ ప్రాజెక్టును క్షుణ్ణంగా పరిశీలించింది. ఆయనతోపాటు జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జి ఎస్ ఐ)మాజీ డైరెక్టర్ రాజు,సిఇ సిడిఓ విజయ భాస్కర్, హైడ్రాలజీ గేట్ల నిపుణుడు సత్యనారాయణ, కడప ఇంచార్జ్ చీఫ్ ఇంజనీర్ శ్రీరామచంద్రమూర్తి ఉన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని వారి వెంట తీసుకువెళ్లారు. స్వయంగా డిజైన్లను పరిశీలించారు. ఇప్పటికే ప్రభుత్వ పరిశీలనలో ఉన్న డిజైన్లను పరిశీలించారు. అన్నిటినీ పరిశీలించిన తర్వాత ప్రాజెక్టుకు వస్తున్న వరద నీటి ఉధృతిని తట్టుకునేలా డ్యామ్ ను నిర్మించాలని, గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పలు అంశాలను పరిగణలోకి తీసుకొని నివేదిక సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇప్పటికే ప్రాజెక్టు పునర్నిర్మానానికి సంబంధించిన నివేదిక సిద్ధం చేసేందుకు రెండు మూడుసార్లు జిల్లా అధికారులతో చర్చలు జరిపారు. డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందో లేదో చూడాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన విధానాన్ని కూడా కమిటీ సూచించింది. నిపుణుల కమిటీ నివేదిక సిద్ధమైన వ్యవహారానికి సంబంధించి అధికార యంత్రాంగం చాలా రహస్యంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వానికి నివేదిక వెళ్లే వరకు ఎలాంటి విషయాలు బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రాజెక్టు కుడివైపున కొండకు పక్కనే మరో స్పివే నిర్మాణం చేపట్టేందుకు దాదాపు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అంతేకాకుండా గతంలో ప్రతిపాదించిన, టెండర్లు పిలిచిన బ్యారేజ్ నిర్మాణం అవసరం లేదని తేల్చి చెప్పినట్టు సమాచారం. ముఖ్యంగా ఎర్త్ డాం నిర్మాణాన్ని కోర్ వాల్ పద్ధతిలో చేపట్టాలని సిఫార్సు చేసినట్లు సమాచారం. నిర్మాణ ప్రాజెక్టులలో, కోర్ వాల్ అనేది ఒక కేంద్ర, నిలువు నిర్మాణ మూలకం. ఇది గాలి మరియు భూకంప కార్యకలాపాల వంటి పార్శ్వ శక్తులను నిరోధించడం ద్వారా స్థిరత్వాన్ని అందిస్తుంది. అందుకే దీనిపై మొగ్గ చూపినట్లు సమాచారం. రాక్ ఫిల్ డామ్ నిర్మాణం కూడా పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. అయితే ప్రస్తుతం ప్రాజెక్టు ఎడమవైపున కొండ పక్కనే నిర్మించి ఉన్న స్పిల్ వే నిర్మాణంతోపాటు కుడివైపున కూడా మరొక స్పిల్ వే నిర్మించాలని ఖరారు చేశారు. ఎన్ని గేట్లు ఏర్పాటు చేస్తారనేది రహస్యంగా ఉంచారు. కానీ ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టు గేట్ల పటిష్టతపై నిపుణుల కమిటీ అనుమానాలు వ్యక్తం చేసింది. అందుకే ప్రాజెక్టు గేట్లు పట్టిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. ఎర్త్ డ్యామ్ కొట్టుక పోయినప్పుడు కూడా ఐదో గేటును అధికారులు తెరవలేదు. దీనివల్ల నీటి విడుదల సామర్థం 1. 80 లక్షల క్యూసెక్కులకే పరిమితమైంది. కేంద్ర జల సంఘం కూడా ప్రాజెక్టు డిజైన్లు ఖరారు చేసిన తర్వాత నీటి విడుదల సామర్థం ఏ మేరకు ఉంచాలని నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్టు తెలిసింది. గతంలో ప్రతిపాదించిన 8.23 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల సామర్థం అనేది దాదాపు కాదని తెలుస్తోంది. ఎందుకంటే బ్యారేజ్ నిర్మాణం పరిశీలన లోనే లేదు. రెండు స్పిల్ వేల మధ్యలో ఎర్త్ డ్యామ్ పక్కా ప్రణాళికతో, పటిష్ఠంగా వరద దుర్భేద్యంగా నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇటీవలే నాలుగు రోజుల పాటు జిల్లా అధికారులంతా నిపుణుల కమిటీతో కలిసి సుదీర్ఘ చర్చలు జరిపారు. నివేదికను రాష్ట్ర ప్రభుత్వ జల వనరుల శాఖ సలహాదారుడు వెంకటేశ్వరరావుకు త్వరలోనే సమర్పిస్తారని తెలిసింది. ఆయన ద్వారానే ప్రభుత్వానికి నిపుణులు కమిటీ సిద్ధం చేసిన నివేదిక అందనుంది. నదీ గర్భంలో గతంలోనే బయటపడిన సొరంగాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తట్టుకునేలా, నీరు ఏ మాత్రం లీక్ కాకుండా నిర్మాణం చేపట్టే విషయంలో చాలా జాగ్రత్తలు నిపుణుల కమిటీ తీసుకున్నట్లు తెలిసింది.

## సీఎం పర్యటన విజయవంతం చేద్దాం

### రాజంపేట జిల్లా చేయాలని సీఎంను కోరుతాం

### టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్ జగన్మోహన్ రాజు



రాజంపేట, ఆగస్టు30 ప్రభాతవా ర్త

సెప్టెంబర్ 1న రాజంపేట మండలంలో సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ జగన్మోహన్ రాజు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్ర నిర్మాత చంద్రబాబు గారి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ ఒక క్రమశిక్షణ గల పార్టీ అని కార్యకర్తలందరూ సమన్వయంతో సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు పాటుపడాలన్నారు. రాజంపేట జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఆరు మండలాల ఏకగ్రీవ తీర్మానం చేసి సీఎంకి అందజేస్తామని తెలిపారు. సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు ఆరు మండలాల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులకు ముఖ్య నాయకులకు ఇన్చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు దిశ, నిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ సీనియర్ నేత డాక్టర్ పారా సుబ్బానాయుడు, పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, మండల గ్రామీణ అధ్యక్షుడు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, రాజంపేట పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, డాక్టర్ నవీన్ కుమార్, బాసినేని వెంకటేశ్వర్లు, నాగినేని నాగేశ్వర్ నాయుడు, ఆరు మండలాల నేతలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కృషితో భూ సమస్య పరిష్కారం



రాజుపాలెం, ఆగస్టు 30, ప్రభాతవార్త:

మండల పరిధిలోని పర్లపాడు గ్రామంలో చాలామంది రైతుల సొంత భూములు దేవాదాయ భూములుగా రికార్డులలో నమోదు కావటం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ జెడ్పిటిసి సభ్యులు తోట మహేశ్వర్ రెడ్డి బాదిత రైతులతో కలిసి ఎమ్మెల్యే వరదరాలను దృష్టికి తీసుకుపోవడంతో ఆయన జిల్లా కలెక్టర్ గారితో మాట్లాడి వారి సమస్యను పరిష్కారం చేశారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి పర్లపాడు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. చాలా కాలం నుంచి ఎదురవుతున్న సమస్యను రైతులు పడుతున్న పాట్లను మహేశ్వర్ రెడ్డి గుర్తించి వారికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారని రైతులు అయన సేవలను కొనియాడారు.

## కానగూడూరు గ్రామ పంచాయితీ కార్యదర్శి సస్పెన్షన్

దువ్వూరు, ఆగస్టు 30, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కానగూడూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలస్వామిని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఇతను 2021, 2024 మధ్యలో వీరబల్లి మండలం సానిసాయి పల్లె గ్రామ పంచాయితీ కార్యదర్శిగా పని చేస్తూ 40లక్షల రూపాయలు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రావడంతో వాటిపై విచారణ జరిపారు. దీనికి సంబంధించిన జనరల్ ఫండ్, 15వ ఫైనాన్స్ కార్పొరేషన్ సంబంధించిన నిధులు, నాలుగు సంవత్సరాల పాటు రికార్డులు నిర్వహించకపోవడం, దుర్వినియోగం చేయడంతో అతనిని సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఇతను దువ్వూరు మండలంలోని కానగూడూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా ఉన్నందున అతనిని సస్పెండ్ చేసి కార్యదర్శి బాధ్యతలు వేరే కార్యదర్శికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

## కేసీ కాలువ ఆయకట్టులో ముమ్మరంగా వరి నాట్లు

దువ్వూరు, ఆగస్టు 30, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కెసి కాలువ ఆయకట్టు పరిధిలో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యారు. అలాగే ఆయకట్టు ప్రాంతంలోని భూముల్లో వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది కేసీ కాలువకు 20 రోజులు ముందుగా నీరు రావడంతో కేసీ ప్రాంతాల్లో వరి నారుమళ్లు సాగు చేశారు. ప్రస్తుతం వరి నాట్లు వేసేందుకు ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. మండలంలోని దువ్వూరు, కానగూడూరు, ఇడమడక, జిల్లెల్ల, నేలటూరు, ఎర్రబల్లే, మాసనపల్లె, బుక్కాయ పల్లె, భీమునిపాడు తదితర గ్రామాల్లో ఎక్కువగా కేసీ కాలువ కింద ఆయకట్టు భూములు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కొన్ని చోట్ల వరి నాట్లు పూర్తి కాగా మరి కొన్నిచోట్ల నాట్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. కేసి ఆయకట్టు ప్రాంతంలో దువ్వూరు మండలంలో సుమారు 12వేల ఎకరాలు ఉంది. 12వేల ఎకరాల్లో పూర్తిగా వరి సాగు అవుతుంది. అలాగే గొట్టపు బావుల కింద 2వేల ఎకరాలు, కుందూ నది ప్రాంతమైన పెద్ద జొన్నవరం, నెలటూరు, మాసనపల్లె గ్రామాల్లో 1500 ఎకరాల్లో వరి సాగు అవుతుంది. ఈ ఏడాది మండలంలో సుమారు 16 వేల ఎకరాల్లో వరి సాగు అయ్యే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. ప్రస్తుతం ఆయకట్టు ప్రాంతంలో వరి నాట్లు జరుగుతుండగా వారం రోజుల్లో పూర్తి అవుతాయి. వరి సాగు చేసే రైతులకు యూరియా, డిఏపి వంటి రసాయనిక ఎరువులు ఎంతో అవసరం ఉంది. అవి దొరకక పోవడంతో ఎక్కువ ధర చెల్లించి తెచ్చుకుంటున్నారు. ఈ రెండు రకాల ఎరువులను సరఫరా చేయడంలో ప్రభుత్వ సక్రమంగా చర్యలు తీసుకోకపోవడంతో రైతులు అధిక ధరలకు కొంటున్నారు. నాట్లు వేసిన తర్వాత కూడా ఈ రెండు రకాల ఎరువులు రైతులకు అవసరం ఉంటాయి. అప్పటికైనా అందుబాటులో ఉంచుతారో లేదో తెలియడం లేదు. యూరియా, డిఏపి వంటి ఈ రెండు రకాల ఎరువులను ఎక్కువగా రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తే వరి రైతులకు ఆసరాగా ఉంటుంది. ఆ దిశగా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



### ప్రేమ,సినిమా మోజులో పడి

## విద్యను నిర్లక్ష్యం చేయొద్దు

### జిల్లా మూడవ అదనపు న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్




విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా మూడవ అదనపు న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్

రాజంపేట, ఆగస్టు30 ప్రభాతవార్త

విద్యార్థి దశలో సన్మార్గంలో సాగాలని, ప్రేమ సినిమా మోజులో పడి విద్యను నిర్లక్షయం చేయవద్దని జిల్లా మూడవ అదనపు న్యాయమూర్తి యస్. ప్రవీణ్ కుమార్ కోరారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చల ఉన్నత శిఖరాలకు చేరుకునే లక్షయంతో విద్యను అభ్యసించాలని సూచించారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బాల్యవివాహాలు, న్యాయ చట్టాలు, పౌర హక్కులపై న్యాయమూర్తి వివరించారు. చిన్న వయసులో వివాహాలు సరికాదన్నారు. అందుకే ప్రభుత్వం బాల్యవివాహాల నిషేధిత చట్టం తీసుకొచ్చిందన్నారు. బాలికలు 18 ఏళ్లు దాటినంత వరకు వివాహానికి దూరంగా ఉండాలన్నారు. అంతలోపు వివాహాలు చేసుకున్నట్లయితే శరీరం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండదన్నారు. అలాగే గృహహింస చట్టం, పోస్కో చట్టం, లైంగిక వేధింపులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమణ రాజు, రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత నాయుడు, గైనకాలజిస్ట్ మెహతాజ్ బేగం , న్యాయవాదులు శ్రీనివాసులు, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు అంకిత భావంతో పనిచేయాలి

### వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి..




కడప, ఆగస్టు 30, ప్రభాతవార్త:

ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలను కార్యదీక్షతో, అంకిత భావంతో పూర్చి చేసి.. ప్రజలకు ఎలాంటి కొరత లేకుండా చూడాలని.. వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో.. జెడ్పి చైర్మన్ రాంగోవిందరెడ్డి అధ్యక్షతన వైఎస్ఆర్ కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల జడ్పి సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సర్వసభ్య సమావేశానికి.. వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు, రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, ఎమ్మెల్సీలు రాంగోపాల్ రెడ్డి, పి. రామసుబ్బా రెడ్డి, రామచంద్రా రెడ్డి, కమలాపురం, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేలు కృష్ణ చైతన్య రెడ్డి, నంద్యాల వరదరాజుల రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ జయ ప్రకాష్, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా.. పులివెందుల, ఒంటిమిట్ట నూతన జెడ్పిటిసీ సభ్యులుగా ఎన్నికైన మారెడ్డి లతారెడ్డి, అద్దలూరు ముద్దు కృష్ణారెడ్డి లు ప్రమాణ స్వీకారం చేశారు.... ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలా మంచి చేసేందుకే అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలకు సంతృప్తి కరమైన కనీస, మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా సమస్యలు లేని జిల్లాగా తీర్చిద్దేందుకు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన అన్ని అభివృద్ధి పలనులను, గతంలో చేపట్టి ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న పనులను కుడా ప్రణాళిక ప్రకారం పూర్తిచేసేలా చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. అలాగే ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో అధికారులతో పాటు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ఎలాంటి ఎరువుల కొరత లేదని మిగతా 2వ పేజీలో

## కమలాపురం, జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూరు సబ్ జైలులు విజిట్






కడప కలెక్టరేట్ ఆగస్టు 30, ప్రభాతవార్త:

న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని వారి సూచనల మేరకు సెక్రటరీకంసీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్. బాబా ఫక్రుద్దీన్ వారు కమలాపురం, జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూరు సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్లను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ల ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమును వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, జైళ్లలో బాల నేరస్తులు ఉంటే గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం మొదలగు అంశాలను వివరించారు. అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లను, వంట గదిని, వసతి గదులను, పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే కమలాపురం మండల న్యాయ సమితిని, జమ్మలమడుగు మండల న్యాయ సేవా సమితిని, ప్రొద్దుటూరు మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం, జమ్మలమడుగు మరియు ప్రొద్దుటూరు సబ్ జైలుల సూపరిండెంట్ లు, ఇంచార్జ్ సూపరిండెంట్ లు, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

## నేత్ర దాణ ఆవశ్యకత కరపత్రాల ఆవిష్కరణ



ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 30.ప్రభాతవార్త

ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి లోని కంటి వైద్య విభాగం వద్ద నేత్ర దాన పక్ష ఉత్సవాలు సందర్భంగా కడప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశానుసారం కడప జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ మాధవిలత ఆధ్వర్యంలో నేత్రదాన అవశ్యకతపై కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూపనంద్, ఆర్ఎంఓ గోపాల్ ద్వారా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంతి, ఆప్తాల్మిక్ అధికారులు కేజే రఘు రామిరెడ్డి, చంద్ర మోళి, తేజ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనదారుల దారి మళ్లింపు

పీలేరు ఆగస్టు 30 ప్రభాతవార్త:

పట్టణ ప్రజలకు, పీలేరు గుండా వెళ్లే ఇతర వాహనదారులకు పీలేరు పోలీసు వారు తెలియజేయు సమాచారం ఏమనగా రేపు పీలేరు పట్టణంలో జరగబోయే గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా కొంత ట్రాఫిక్ మార్పులు చేయడం జరుగుతుంది, కనుక ప్రజలందరూ గమనించి పోలీసు వారికి సహకరించవలసిందిగా మనవి. 1) మదనపల్లి వైపు నుండి ఎటువంటి వాహనాలు పీలేరు పట్టణంలోకి మదనపల్లి పాత రోడ్డు కూడా అనుమతి లేదు, ఎవరైనా పట్టణంలోకి రావాలి అని అనుకుంటే కడప రోడ్డు అక్కడి నుండి నాలుగు రోడ్ల గుండా వారి యొక్క గమ్యస్థానం చేరుకోవచ్చు. 2) అలాగే తిరుపతి నుండి మదనపల్లి వైపు వెళ్లే వాళ్లు పీలేరు బైపాస్ గుండా వెళ్ళవచ్చు. 3) కడప నుండి చిత్తూరు వెళ్లే వారు బైపాస్ గుండా మరువ వడ్డేపల్లి, కోటపల్లి క్రాస్, ఫోర్ రోడ్స్ చేరుకొని తద్వారా చిత్తూరు వైపు వెళ్ళవచ్చు అలాగే చిత్తూరు నుండి వచ్చే వాహనాలు కూడా కోటపల్లి క్రాస్, మరవ వడ్డేపల్లి కడప సర్వీస్ రోడ్ ద్వారా కడప రోడ్ చేరుకొని కడప వైపు వెళ్ళవచ్చు. ఆర్టీసీ బస్సులు మరియు ఇతర ఇతర ప్రైవేటు బస్సులు కూడా దయచేసి ఈ మార్గాన్ని అనుసరించవలెనని కోరుకుంటున్నాము.

## అన్నదానం మహా పుణ్య కార్యక్రమం

### మండల అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి



లక్కిరెడ్డిపల్లి; ఆగస్టు 30 ప్రభాతవార్త

అన్నదానం మహా పుణ్య కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ కుల,మత కతీతంగా భక్తి భావాన్ని అలవర్చుకుని సన్మార్గంలో నడవాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని స్థానిక లక్కిరెడ్డిపల్లె స్టేట్ బ్యాంక్ సమీపంలోని వినాయక మంటపాల వద్ద భక్తులకు గొప్ప అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ సుదర్శన్ రెడ్డి కుటుంబాలు ఏర్పాటు చేశారు. వెయ్యి మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సుదర్శన్ రెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి కుటుంబ సభ్యులను కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన గొప్ప అన్నదాన కార్యక్రమంలో వారు పాల్గొని భక్తులకు అన్న ప్రసాదమును వడ్డించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు రఘునాథ, ప్రసాద్ యాదవ్, కులయప్ప, చంద్ర, శ్రీనివాసులు, శంకర, ఉప మండల అధ్యక్షులు సుబ్బరాయుడు, సర్పంచులు వెంకట్ నారాయణ రెడ్డి, గడ్డం కళ్యాణి ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దస్తగిరి, లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచులు దుర్గయ్య, ఉప సర్పంచులు సంజీవరెడ్డి, మైనార్టీ నాయకులు చాన్ బాషా, జాకీర్, కాజా, కదిర్, సాహెబ్, సద్దాం, వైయస్సార్సీపి నాయకులు సభాపతి నాయుడు, నాగ శేషారెడ్డి, బన్ రెడ్డి శంకర్ రెడ్డి, తోపురెడ్డి గోపాల్ రెడ్డి, తోపురెడ్డి మల్రెడ్డి ,ఢిల్లీ విశ్వనాథరెడ్డి, కొండ ఓబుల్ రెడ్డి, నాగముని, నారద, భక్తులు పాల్గొన్నారు.

## జలహారతులు సరే-చెరువులకు నీరెప్పుడు

### వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్



ముఖ్యమంత్రి మోసంపై ప్రజలకు వివరిస్తున్న దృశ్యం

మదనపల్లె, ఆగస్టు 30 ప్రభాతవార్త :

హంద్రీ-నీవా జలాలకు కూటమి ప్రభుత్వం జలహారతులు ఇస్తున్నారు సరే నియోజకవర్గంలోని చెరువులకు నీరెప్పుడు నింపుతారంటూ వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ ప్రశ్నించారు. శనివారం పట్టణంలోని 8,9వ మున్సిపల్ వార్డుల్లో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల దాహర్తి నివారణకు దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో చిప్పిలి, గుంటివారిపల్లె రిజర్వాయర్ల నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. ఈ రెండు రిజర్వాయర్లను పూర్తి చేసి హంద్రీ-నీవా జలాలను మళ్ళించి పట్టణ ప్రజల దాహర్తి తీర్చాలన్నారు. అదే విధంగా నియోజకవర్గంలోని అన్ని చెరువులకు హంద్రీ-నీవా జలాలను నింపి రైతులకు వ్యవసాయం సాగు చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రజలను అన్ని విధాల మోసం చేస్తున్నారన్నారు. హంద్రీ-నీవా జలాలు కుప్పం వరకు వెళ్ళాయని సంబరాలు తప్పా రైతులకు, ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. హంద్రీ-నీవా కాలువ నీటి సామర్థ్యం పెంచి ప్రాజెక్టులకు, చెరువులకు నీరు అందించినప్పుడే ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, షమీంఅస్లాం, కౌన్సిలర్లు పాల్ చంద్రశేఖర్, ఈశ్వర్‌నాయక్, నాయకులు ఇర్ఫాన్‌ఖాన్, ఆంజినేయులు, వీఎస్.రెడ్డి, చరణ్, రఘునాథ్‌రెడ్డి, మహేష్, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె, ఆగస్టు 30 ప్రభాతవార్త :

జిల్లా సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.10వేలకోట్లు కేటాయించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. శనివారం ఏఐటియుసి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు ఏర్పాటు చేసి వలసలు నివారించాలన్నారు. మదనపల్లెను జిల్లాగా వెంటనే ప్రకటించాలన్నారు. ఆటో డ్రైవర్లకు ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఉచిత బస్సు పథకంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలన్నారు. జిఓనెంబర్ 21, 31లను రద్దు చేసి ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం అమలు చేయాలన్నారు. ఎఫ్‌సి సేవలు మదనపల్లె ఆర్టీఓ కార్యాలయంలోనే కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటిలో జనాభా ప్రాతిపదికన ప్రకారం కార్మికుల సంఖ్యను పెంచి పనిభారం తగ్గించాలన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి ముభారక్, నాయకులు మాధవ్, తిరుమల, దేవా, చలపతినాయుడు, రాధ, భాస్కర్, మస్తాన్, కరీముల్లాలు పాల్గొన్నారు.




## తగ్గిన టమోట ధరలు ఆందోళనలో రైతులు

మదనపల్లె, ఆగస్టు 30 ప్రభాతవార్త :

టమోటాకు ధరలు గత నాలుగు రోజులుగా తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ లేకపోవడం వల్లే ధరలు సగానికి సగం తగ్గాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. శనివారం మార్కెట్‌యార్డుకు 113మెట్రిక్ టన్నులు టమోటాలు రాగా, 10కేజీల టమోటా బాక్స్ మొదటి రకం రూ.230నుంచి 250ల వరకు ధరలు పలికాయి. నాలుగు రోజుల క్రితం పదికేజీల టమోటా బాక్స్ రూ.450నుంచి 500ల వరకు ధరలు ఉండేవి. ఉన్నఫలంగా సగానికి సగం ధరలు తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎకరా టమోటా సాగు చేయాలంటే రూ.1.50లక్షల నుంచి 2లక్షల వరకు ఖర్చు అవుతుంది. గిట్టుబాటు ధర లేకపోవడంతో టమోటా రైతులు అధికంగా నష్టపోతున్నారు. టమోటా వ్యాపార లావాదేవీలకు మదనపల్లె మార్కెట్‌యార్డు రాష్ట్రంలోనే పేరు పొందింది. ఇక్కడి ప్రాంత రైతులు టమోటాను ఏడాది పొడవునా జీవనాధార పంటగా సాగు చేస్తారు. ప్రభుత్వం స్పందించి టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని పలువురు కోరుతున్నారు.

## కైలాసగిరి పర్వతం సెట్‌లో కొలువైన బాలవినాయక స్వామి

రామసముద్రం ఆగస్టు 30 ప్రభాతవార్త



గణేష్ నవరాత్రి ఉత్సవాలు కోసం మండల కేంద్రంలో వివిధ ప్రాంతంల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణ గా నిలుస్తున్నాయి. మండల కేంద్రంలోని బలిజ వీధిలోని కైలాస పర్వతం సెట్ లో ప్రతిష్టించిన బాలవినాయకుడు ప్రత్యేక ఆకర్షణం గా నిలిచింది. పార్వతి తనయుడుని వివిధ రూపాల్లో తీర్చి దిద్ది ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రం, పలు గ్రామాల్లో ఆదివారం నుంచి నిమిజ్జన కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.

## బీసీ నూతన అధ్యక్షుడిగా చెన్నకృష్ణ

సుండుపల్లి, ఆగస్టు 30, ప్రభాతవార్త :



మండల కేంద్రంలో ఇటీవల మండల కురబసంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా గంతల చెన్నకృష్ణకు రాజంపేట అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గం జనసేనపార్టీ నాయకులు రామ శ్రీనివాస్ జనసేన శ్రేణులతో కలిసి ఘనంగా సన్మానించి హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అనునిత్యం బడుగు బలహీన వర్గాల వారికి ముఖ్యంగా బీసీలు రాజకీయంగా ఉన్నతస్థాయికి ఎదగాలని అదేవిధంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కేవలం బీసీలను ఓట్లు వరకే పరిమితం చెయ్యకుండా ఎన్డీయే కూటమి ప్రభుత్వం ద్వారా వారి సంక్షేమ అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా జనసేన మాజీ సోషల్ జస్టిస్ సభ్యులు షేక్ సలీమ్, నవీద్, కిరణ్, రామంజులు, సిద్ధార్థ, సాజిద్, అజాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాస్ పై శిక్షణ కార్యక్రమం



నిమ్మనపల్లి ఆగస్టు 30 ప్రభాతవార్త

నిమ్మనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అక్షర ఆంధ్ర (ఉల్లాస్) ఎంపీడీవో ఆధ్వర్యంలో వీటిఎస్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో అక్షరాస్యత తరగతులు త్వరగా ప్రారంభించి, ప్రతి రోజు బోధన సాగేలా చూడాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని చెప్పినారు. ఏపియంలను పర్యవేక్షణ చెయ్యాలని కోరినారు. వాచక బోధనతో పాటు, ఫైనాన్సియల్, డిజిటల్, ఫంక్షనల్ లీటరసీ పైన కూడా అవగాహన కల్గించాలని, 2029 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాదించాలి అని వక్కాణించడం జరిగింది. బోధన నిరంతరం సాగాలని సూచించారు. ICDS సూపెర్వైజర్ మరియు వెలుగు దిది వయోజనుల విద్య ఆవశ్యకత గురించి చక్కగా వివరించినారు. ఏటీఎం ఏపీవోలు VTs లకు దిశా నిర్దేశం చేసినారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ స్టాఫ్, ఐసిడిఎస్ సూపెర్వైసోర్స్, పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్ట రిత్యా నేరం



సిద్ధవటం ఆగస్టు30 ప్రభాతవార్త

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్టీ కాలనీ వాసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందించారు మండల కేంద్రమైన సిద్ధవటంలోని చెంచులక్ష్మి ఎస్టీ కాలనీలో శనివారం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది రామదాసు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం నేరమని ఆడవారికి 18 సం, మగ వారికి 21 సం, పూర్తి అయ్యాక వివాహాలు చేయాలని వివాహ వయసు రాకముందే బాల్య వివాహాలు చేపడితే పిసిఎంప చట్టం 2006 ప్రకారం 2 సం, జైలు శిక్ష మరియు జరిమానా విధిస్తారని ఎవరైనా చట్ట విరుద్ధంగా బాల్యవివాహాలు చేపడితే,1098 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి తెలపాలని అన్నారు ఎవరికైనా ఎస్టీ కాలనీ వాసులకు బర్త్, మరియు మ్యారేజ్ సర్టిఫికెట్ల కోసం నోటరీ ఉచితంగా చేస్తామని తెలిపారు ప్రతి గ్రామంలో బాల్య వివాహాలు పైన అవగాహన కల్పిస్తూ ఉన్నామని ఎవరైనా స్కూలుకు వెళ్లకుండా పిల్లలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వారికి మంచి ప్రవర్తన కల్పించి స్కూలుకు పంపుతామని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, శ్రీనివాసులు, శివ యానాది కాలనీవాసులు పాల్గొన్నారు.

## గంగమ్మ ఒడికి గణనాధులు

గాలివీడు, ఆగస్టు 30(ప్రభాతవార్త):

వినాయక చవితి సందర్భంగా విశేష పూజలందుకున్న గణేశుడు శనివారం గంగ ఒడికి చేరాడు. మండల వ్యాప్తంగా నాల్గవ రోజు వినాయక నిమజ్జన వేడుకలు కోలాహలంగా జరిగాయి. జై గణేశా.. జైజై గణేశా నినాదాలు, మేళ తాళాలతో గణనాధుడి నిమజ్జన కార్యక్రమం సంబరంగా సాగింది. పలు విగ్రహాల వద్ద లడ్డు వేలంపాటలో లడ్డును దక్కించుకోవడం కోసం ప్రజలు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. రామాలయం వద్ద జరిగిన వేలంపాటలో చెన్నకృష్ణారెడ్డి వారి కుటుంబసభ్యులు రూ.41 వేలకు లడ్డును దక్కించుకున్నారు. సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి మండపాల నుంచి వినాయకుడిని కదిలించారు. నిమజ్జన కార్యక్రమానికి ఆటంకం లేకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోగా, యువత నృత్యాలు చేస్తూ కోలాటాలు వేస్తూ వినాయకుడిని గంగ ఒడికి సాగనంపారు. గాలివీడు పట్టణంలో భారీ వినాయక విగ్రహాలు వెళ్తుండగా శోభాయాత్ర యువతీ యువకుల ఉత్సాహం కేరింతలో సందడి నెలకొంది. గ్రామీణ ప్రపాంతాల్లో వంకలు, చెరువుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.



## వినాయక ఉత్సవాల్లో సర్పంచ్ అన్నదానం

మదనపల్లె, ఆగస్టు 30 ప్రభాతవార్త :



అన్నదానం చేస్తున్న సర్పంచ్

ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది వినాయకుడి ఉత్సవాల్లో పాల్గొని, ఆయన ఆశీస్సులు అందుకుందామని కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని కురవంక పంచాయితీకి చెందిన ప్రజల ఆహ్వానం మేరకు కురవంక సర్పంచ్ చలపతి హాజరయ్యారు. ఆయనకు పుష్పగుచ్చం అందజేసి శాలువా కప్పి, స్వాగతం పలికారు. బాణసంచా పేల్చి బళ్ళారిడ్రమ్స్‌తో స్వాగతం పలికారు. అనంతరం వినాయకుని విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. సర్పంచ్ చలపతి చేతుల మీదుగా భక్తులకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ చలపతి మాట్లాడుతూ మనదేశంలో వినాయక చవితి పండగను ప్రజలు అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బివైఎస్ నాయకులు పునీత్, చిప్పిలి హరి, వినయ్, వార్డుసభ్యులు, నాగరాజు, శ్రీనివాసులు, సాయి, మాబు పాల్గొన్నారు.

## శ్రీరామసేన పిడబ్ల్యూడీ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



ప్రొద్దుటూరు అర్బన్, ఆగష్టు 30, ప్రభాతవార్త :

స్థానిక వైఎంఆర్ కాలనీ లోని శ్రీరామ సేన పిడబ్ల్యూడీ యూత్ ఆధ్వర్యంలో పిడబ్ల్యూడీ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన మటి గణేశుని వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. అయ్యప్ప స్వామిని తలపించే విధంగా వీరు గణేశుని ఏర్పాటు చేసి 18 మెట్లు కూడా ఏర్పాటు చేయడం విశేషం. అదేవిధంగా సుబ్రహ్మణ్య, లక్ష్మీదేవి ప్రతిమలను గణేశుని ప్రతిమకు కుడి ఎడమ వైపున, మండపం బయట ఆదియోగి (శివయ్య) విగ్రహం ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం దాదాపు 2500 మందికి కమిటీ వారు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ సేన పిడబ్ల్యూడీ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో మెడిటేషన్ కార్యక్రమం



వేంపల్లె: ఆగష్టు 30 (ప్రభాత వార్త):

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో హార్ట్ ఫుల్ మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు యన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి కోటేశ్వరి, విభాగాధిపతి సౌజన్య తెలిపారు. శనివారం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో కెమికల్ ఇంజనీరింగ్ విభాగం, యన్ ఎస్ ఎస్ యూనిట్ 4 సంయుక్తంగా కలిసి హార్ట్ ఫుల్ మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ధ్యానం ద్వారా ఒత్తిడి నియంత్రణ ప్రాధాన్యత పై ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా వివరించారు. వైద్య నిపుణులు డాక్టర్. రాజశేఖర్, డాక్టర్ నాగవేణి మెడిటేషన్ విధానాన్ని వివరించి తొలి రోజు సాధన నిర్వహించారు. క్యాంపస్ హాస్పిటల్ వైద్యులు కూడా ధ్యాన కార్యక్రమంపై మార్గదర్శనం అందించారు. ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల అడ్మినిస్ట్రేటివ్ అధికారి రవికుమార్ అభినందించారు. ఈ కార్యక్రమం అధ్యాపకులు, విద్యార్థులు, యన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.


## నందీశ్వరస్వామి దేవస్థానాన్ని నిర్మించడం హర్షనీయం



వేంపల్లి: ఆగస్టు 30 (ప్రభాతవార్త);

పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంలో, వేంపల్లి మండలం, నంది పల్లె గ్రామంలో గ్రామ ప్రజలు, దాతల, ప్రభుత్వ సహకారంతో మూడున్నర కోట్ల రూపాయల అంచనా విలువలతో సర్వాంగ సుందరంగా నందీశ్వర స్వామి దేవస్థానాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్మిస్తూ ఉన్నారు. నంది పల్లె గ్రామ సర్పంచ్ ,శ్రీ నందీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డి విజ్ఞప్తి మేరకు రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి శనివారం నిర్మాణ దశలో ఉన్న శ్రీ నందీశ్వర స్వామి దేవస్థానాన్ని దర్శించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ పులివెందుల వేంపల్లి నాలుగు వరుసుల రోడ్డు పక్కన ప్రశాంతమైన వాతావరణంలో నందీశ్వర స్వామి దేవస్థానం నిర్మాణం అవుతోందని, ప్రత్యేకించి గ్రామం పేరు నందిపల్లెకు తగ్గట్టుగా నంది విగ్రహం చూడ ముచ్చటగా ఉందని తులసి రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, నందీశ్వర స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డి ,కమిటీ సభ్యులు రామాంజనేయరెడ్డి, చంద్రారెడ్డి, శ్రీరామిరెడ్డి, మల్లికార్జునెడ్డి, రామగంగిరెడ్డి, రామలింగేశ్వర్ రెడ్డి ,శివ ప్రసాద్ రెడ్డి ,కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి ,ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి ,ఐచర్ రమణ ,చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడికి డీఎస్సీలో 20వ ర్యాంక్



వేంపల్లి:ఆగష్టు 30:(ప్రభాత వార్త)

వేంపల్లి చైతన్య హైస్కూల్‌లో సోషియల్ టీచర్‌గా పనిచేస్తున్న శ్రీ బోగ్గల నాగార్జున డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ (సోషియల్) విభాగంలో చిత్తూరు జిల్లా స్థాయిలో 20వ ర్యాంక్‌తో ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని వేంపల్లి చైతన్య హైస్కూల్ చైర్మన్ బి చక్రపాణి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ – మన పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఇంత మంచి ర్యాంక్ సాధించడం మాకు గర్వకారణం. ఇది విద్యార్థులకు, సిబ్బందికి ఒక గొప్ప ప్రేరణ” అన్నారు.

## ప్రొద్దుటూరు రూరల్ సీఐ నాగభూషణం

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 30, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు రూరల్ సీఐ నాగభూషణం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తారని ప్రజలకు రక్షణ కల్పిస్తానన్నారు. రూరల్ పరిధిలోని మట్కా జూదం రూపుమాపేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

## బాల్య వివాహాలు అరికడదాం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి మహేష్

పీలేరు, ఆగస్టు 30 ప్రభాతవార్త:

మండలంలోని గొర్రెపల్లి పంచాయతీలో మర్రి మాకుల తండాలో నిర్వహించిన సమావేశంలో జడ్జి పాల్గొని మాట్లాడుతూ సమాజంలో సమిష్టి కృషితో బాల్య వివాహాలు అరికడదామని జిల్లా 11వ అదనపు జడ్జి ఎ. మహేష్ అన్నారు. శనివారం మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ మర్రిమాకుల పల్లె తాండాలో బాల్య వివాహాల నివారణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చదుకునే వయస్సులో వివాహం చేసుకోరాదన్నారు. పూర్తిగా శారీరకంగా, మానసికంగా ఎదుగుదల లేనిదే వివాహం చేసుకుంటే పలు ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చెప్పారు. ఎక్కడైన బాల్య వివాహాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ మెజిస్ట్రేట్ జడ్జి ఆర్. మురళి, ఎంపీడీవో శివశంకర్, డీటీ ప్రసాద్, డాక్టర్ చంద్రశేఖర్, ఎంఈవో పద్మావతి, సీడీపీవో రాజమ్మ, బస్టేషన్ మేనేజర్ బాబునాయక్, న్యాయవాది షౌకత్‌అలి. గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాఠశాలకు వాటర్ ట్యాంక్ వితరణ



బద్వేల్ అర్బన్ ఆగస్టు 30 ప్రభాతవార్త :

వాసవి వాసవి క్లబ్ వనిత క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పల్లెకు పోదాం ప్రోగ్రాం చేయడం జరిగింది ప్రోగ్రాంలో భాగంగా వాసవి క్లబ్ వనిత క్లబ్ తరఫున బ్రహ్మంగారి మఠం మండలం చౌదరి వారి పల్లె అంగన్వాడి స్కూల్ కి దాతల సహకారంతో అనుముల శెట్టి సుబ్బరాయుడు కీర్తిశేషులు అనుముల శెట్టి వెంకటసుబ్బమ్మ కుమారుడు సిద్దయ్య కోడలు లక్ష్మీదేవి సహకారంతో స్కూల్ పిల్లలకు వాటర్ ట్యాంక్ లేక ఇబ్బంది పడుతున్నారు అందుకుగాను వారు సహృదయంతో వాటర్ ట్యాంక్ ఇవ్వబడినది, ఈరోజు మాకు సహకరించినటువంటి జిల్లా గవర్నర్ 206 గవర్నర్ రాధాకృష్ణ, వాసవి క్లబ్ అధ్యక్షులు అనుముల శెట్టి సిద్దయ్య సెక్రెటరీ బచ్చు సందీప్ ట్రెజర్ బైసాని సుమంత్ వనిత క్లబ్ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి సెక్రటరీ తులసి వసుంధర ట్రెజరర్ ఉరిమి జోనల్ చైర్మన్ భార్గవ్ అంగడి వాడి స్కూల్ టీచర్ భాగ్యమ్మ అంగన్వాడి ఆయమ్మ భాగ్యమ్మ అలాగే గ్రామస్తులు వారి సేవలను అభినందించడం జరిగింది

## రాగి చెట్టు వేప చెట్టు లకు కళ్యాణం



పులివెందుల,ఆగస్ట్ 30, ప్రభాత వార్త:

పట్టణంలోని స్థానిక గాడి చర్ల వారి వీధిలో వెలసిన రాగి చెట్టు వేప చెట్టులకు శనివారం కళ్యాణం నిర్వహించారు. ఎడాల సుబ్రహ్మణ్యం దంపతులు, భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్యాణాన్ని అర్చకులు కృష్ణ రాజేష్ శర్మ శాస్త్రయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునిసిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్ లు హాజరై కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం అర్చకులు వారిని శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వినాయకుని మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో వరసిద్ధి వినాయక భక్తమండలి, యువజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## పేదరికం లేని సమాజం కోసం పి 4 సర్వే




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి

పీలేరు ఆగస్టు 30 ప్రభాతవార్త :

రాజకీయం చేయడం అంటే పెత్తనం చలాయించడం కాదని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజలు కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం వినియోగించాలని, ప్రజలకు సేవ చేయడమే నిజమైన రాజకీయమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో నిర్వహించిన “స్త్రీ శక్తి“ విజయోత్సవ సభా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ కావడంతో దేశంలోనే సాహస పథకాల సంక్షేమ సారధిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలిచారన్నారు. స్త్రీ శక్తి పథకంతో వివిధ రకాల ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలో మహిళలు ఎక్కడికైనా ప్రయాణం చేసే వెసులుబాటు కల్పించి మహిళలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆయన చెప్పారు. పి 4 సర్వేతో పేదరికం లేని సమాజంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే పేదలను గుర్తించి వారిని దత్తకు తీసుకునే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకెళుతున్నారన్నారు. “స్త్రీ శక్తి“ విజయోత్సవ కార్యక్రమానికి పీలేరు నియోజకవర్గ నలుమూలల మంచి అంచనాలకు మించి మహిళలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తారని అన్నారు. దాంతో ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి స్వయంగా మహిళలకు వారు కూర్చున్న చోటికి వెళ్లి అందరికి అభివాదం చేస్తూ కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## ప్రజావేదిక పరిశీలించిన శరత్

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజంపేటకు విచ్చేయుచున్న సంధర్భంగా ప్రజా వేదికను మధనగోపాలపురం పంచాయితీలో ఏర్పాటు చేయడం జరుగుచున్నది. ఈ సందర్భంగా పనులను పర్యవేక్షిస్తున్న మదనగోపాలపురం గ్రామస్తులు, సీనియర్ తెలుగు దేశం నాయకులు కొండూరు శరత్ కుమార్ రాజు, గ్రామ సర్పంచ్ పెంచలయ్య వైస్ ప్రేసిడెంట్ రుద్రనారాయణ రాజు, విశ్వనాద రాజు, సుబ్బరామరాజు, నరేష్, నరసింహ రాజు, శివ, యెల్లయ్య, నరేష్ యాదవ్, ఉద్దండం సుబ్రమణ్యం తదిరతులు పాల్గొన్నారు.

